Satyamunakai Poratam REGD. No. 67970 / 97

# సత్యమునకై పోరాటం

Editor & Publisher
Bro. *Isaac E. Kusuma*,
MALIKIPURAM - 533 253,
E.G.Dt. (A.P.) India.

Website : www.aotle-india.org
E-mail : isaacekusuma@gmail.com
Office : Ph : 98493 85038

Regd. Monthly Newspaper
**Postal Regd. No. H/APM/01/2009-2011**
Valid upto 12/2009 Posted on 30th of Every Month
**Annual Subscription Rs. 50/-**

To :

Volume : 13 | SEBATH - ADAR - 5769 (February 2009) | Pages : 4 | Issue : 134

హెచ్చరిక : ఈ పత్రిక ఖండితముగా సత్యాన్వేషుల కొరకు మాత్రమే గాని, క్రైస్తవ మతశాఖల వారి కొరకు కాదు

# సార్వత్రిక క్రైస్తవ సమాజమునకు నా పిలుపు పరిచర్య

**(సత్యమును గ్రహించక అపార్థము చేసుకొనుచున్న క్రైస్తవ బోధకులకు, విశ్వాసులకు నా జవాబు)**

**- బ్రదర్ ఐజక్ ఇ. కుసుమ**

నా పేరు ఐజక్ ఎబెనెజర్ ఇంటి పేరు కుసుమ. ఐజక్ ఇ. కుసుమ గా నేను 1982-84లో డూన్ బైబిల్ కాలేజి, డెహరాడూన్ U.P నుండి నేను B.Th., Diploma 1st Class లో తీసుకొని సువార్త ప్రారంభించాను. మా ముత్తాత గారు అన్యుడు. మా తాతగారు లూథరన్ సంఘవిశ్వాసి. మా తండ్రిగారు పెంతెకోస్తు నుండి సిలోన్ పెంతెకోస్తుకు వచ్చి వారి సహవాసములో ఉండెడివారు. నేను చిన్నతనం నుండి క్రైస్తవ భక్తిలోనే పెరిగినవాడను. మా ఇంటికి ది పెంతెకోస్తు మిషన్ సేవకులు వస్తూ ఉండేవారు. వారంటే నాకసలు ఇష్టం ఉండేది కాదు. నా తల్లి చిన్నప్పుడే (నాకు 3 సం॥లు) చనిపోయినది. నాకు ఒక అక్క- చెల్లి ఉంది. తర్వాత మా నాన్నగారు వివాహం చేసుకొని చాలామంది సంతానం కలిగి జీవించారు. మా నాన్నగారు ఒక టీచర్ (క్రాఫ్ట్ ఇన్స్ట్రక్టర్). పిల్లలు ఎక్కువమంది గనుక చాలా యిబ్బందులు, కష్టాలు, బాధలు అనుభవించి జీవించెడివారము. నేను అమలాపురం S.K.B.R College లో చదువుతూ ఉన్నరోజుల్లో **"నరపుత్రుడా, నీవు లేచి నిలబడు నేను నీతో మాట్లాడతాను"** అంటూ ఒక స్వరము వినపడుతూ ఉండేది. నాకు పాస్టర్లు అన్నా, పాస్టరు పనిచేయడం అన్నా అసలు ఇష్టం కాని విషయం గనుక, వద్దు నేను ఆ పని చెయ్యను. నేనేదో ఒక చిన్న ఉద్యోగం చేసుకొని క్రైస్తవ కుటుంబంలో పుట్టాను గనుక యేసుప్రభువునే దేవుడిగా కొలుస్తూ, సమాజంలో మంచిగా జీవిస్తూ ఏదో ఒక మంచి సంఘానికి చెంది ఉండి, వారికే కానుకలను ఇస్తూ జీవితం గడపాలని కోరుకునేవాడిని.

నేను ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లోనే, నా ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడం, చదువుకోవడాన్కి పుస్తకాలు లేక, వేసుకోవడాన్కి సరియైన బట్టలులేక నానా అవస్థలు పడేవాడిని. తీసుకున్నది Bi.Pc Eng Medium. డాక్టర్లు, ఇంజనీర్ల పిల్లల మధ్యలో నా స్థితి చాలా దారుణంగా ఉండేది. వాళ్ళ రేంజ్‌కి నా స్థితి సరిపోక నాజీవితం ప్రక్కదారికి మళ్ళింది. క్లాసులో వారి వేధింపులు, లెక్చరర్స్ సూటిపోటి మాటలు, అర్థం కాని పాఠములు నన్ను పెడదారి పట్టించాయి. క్లాసులోకి వెళ్ళలేక - ఇంటికి ముందుగా పోలేక సినిమాలు చూడడాన్కి ఒక స్నేహితుడు నన్ను పురికొల్పాడు. అలా కొంతకాలం గడిచింది. B.Sc 1st Year చదివాను 2nd Year లో వచ్చేసరికి దేవుని పిలుపు **"నరపుత్రుడా, నీవు లేచి నిలబడు, నేను నీతో మాట్లాడతాను"** అనేది ఎక్కువయ్యింది. అది నాకు యిష్టం కాని విషయం గనుక త్రోసిపారేసేవాడ్ని. తరచుగా **బుస్సకొడుతున్న శబ్దం (Hissing Sound)** నాకు వినపడుతూ ఉండేది. అలవాటు ప్రకారంగా చర్చికి వెళ్ళడం, నాకు మంచిగా అన్పించిన బోధకులతో నా పరిస్థితి చెప్పుకొని ప్రార్థించమని కోరుతూ ఉండేవాడిని. కొన్నికొన్ని సార్లు సినిమాకి వెళ్ళడాన్కి డబ్బులులేకపోతే RCM చర్చిలోకి వెళ్ళి యేసుప్రభువు విగ్రహం దగ్గర మోకరించి ఎక్కువసేపు ప్రార్థించుకుని ఇంటికి వెళ్ళిపోయేవాడిని. అలా ఆల్‌మోస్ట్ అన్ని క్రైస్తవ సంఘాలను నాకు సమయం దొరికినపుడల్లా దర్శిస్తూ నా బాధలను వారికి వివరిస్తూ ప్రార్థనలు చేయించుకుంటూ ఉండేవాడిని. ఆ నేపథ్యంలో హెబ్రోను వారిని, క్రీస్తుసంఘంవారిని, జిడియం వారిని, పెంతెకోస్తు వారిని ఒక్కరేంటి అందరి దగ్గరకు వెళ్ళి వాళ్ళతో కలిసి ఉంటూ ఉండేవాడిని. నేను పండుకునే సమయంలో **బుస్సకొడుతున్న శబ్దం (Hissing Sound)** నాకు తరచుగా వినపడుతూ ఉండేది. భయమేసి ఏదో పాము నన్ను పగపట్టి కరవడాన్కి వచ్చి ఉంటుందని తలస్తూ ఇక రాత్రంతా నిద్రపోక మెలకువతో ఉండేవాడిని. భయమును పోగొట్టుకోవడాన్కి బైబిలును చదువుతూ ఉండేవాడిని. కొన్ని కొన్ని సార్లు బైబిలును తలక్రింద పెట్టుకొని పండుకోవడం, బైబిలును గుండెపై హత్తుకొని పండుకోవడం మొ॥నవి చేస్తూ ఉండేవాడిని. మంచి బోధకులు అని చెప్పే వారి దగ్గరకు వెళ్ళి నాకు యిలా **బుస్సకొడుతున్న శబ్దం (Hissing Sound)** వినపడ్తుంది ఏమిటి అని అడిగితే : అది సాతాను అని చెప్పేవారు, నిన్ను సాతాను వెంబడిస్తుంది అని చెప్పేవారు. ప్రార్థన చేసేసి పంపించేవారు. అయినా ఆ శబ్దం నాకు వినపడుతూనే ఉండేది. అందుకే ఒక దుడ్డుకర్ర, టార్చిలైటు ఎప్పుడూ నా దగ్గర పెట్టుకొని పండుకునేవాడిని. ఆ శబ్దం వినపడగానే నెమ్మదిగా లేచి టార్చిలైటు వేసి చూసేవాడిని. ఎక్కడా ఏమీ కనపడేది కాదు. నా చేష్టలు చూసి మా నాన్నగారు తప్పుకు దొరికితే చాలు కొడుతూ ఉండేవారు. ఇంట్లోనూ-బయటా మనసులోనూ శాంతిసమాధానం లేని జీవితం అయ్యిందినాకు. రెండుమూడుసార్లు చనిపోవడమే మంచిదా? అనే స్తితికి దిగజారిపోయాను. అదే సమయంలో ఒక అమ్మాయి పరిచయం అయ్యింది. నాతో ప్రేమగా మాట్లాడుతూ, నాకు సహాయం చేస్తూ ఉండేది. అది నా జీవితానికి కొంత ఊరట కలిగించినా అదీ ఒక కలగానే చాలా తక్కువ కాలంలోనే అదృశ్యమైపోయింది.

నేను B.Sc 2nd Year చదువుతున్న రోజుల్లో విపరీతమైన తలపోటు రావడం మొదలెట్టింది. దానిని భరించడం మరీ కష్టంగా ఉండేది. మందులు కొనుక్కోవడాన్కిగాని, కళ్ళజోడు వెయ్యించుకోవడానికి గాని డబ్బులు అడగడాన్కి కూడా భయంగానే ఉండేది. ఒకసారి ఖచ్చితంగా "చనిపోవాలనే" నిర్ణయించుకొని ఒక ప్రదేశాన్కి వచ్చాను. అప్పుడు ఎవరో ఒకాయన వెనుకనుండి పిలిచినట్లు అన్పించింది. **"నీవు చనిపోవడానికి వచ్చావు గదా? చనిపోయావే అనుకో ఇక నాకోసం జీవించు. ఇక నీకు ఎవరూలేరు అని అనుకుంటే నా కోసం జీవించు"** అని అన్నట్లనిపించింది. అప్పుడు అనుకున్నాను. "నిజంగానే నేను అందరి దృష్టిలో చచ్చినట్లే, ఇక నీకోసమే జీవిస్తాను ఈరోజునుండే జీవిస్తాను. ఒక క్రొత్తజీవితాన్ని ఆరంభిస్తాను క్రొత్తగానే బ్రతుకుతాను" అని నిర్ణయించుకొని నేనే మారడం ప్రారంభించాను. ఆ తర్వాత ఒక దైవసేవకుడు నాదగ్గరకు వచ్చి "నిన్ను దేవుడు తన సేవకు పిలిచాడు. నీవు ఇక చదవవు. అది నీవు ప్రయత్నించినా జరగదు. గనుక దేవుని మాటకు లోబడి ఆయన సేవ చెయ్యి" అని చెప్పి వెళ్ళిపోయాడు. తలపోటు మొదలైనపుడల్లా, బైబిలు చదువుతూ ఉంటే తగ్గిపోయేది. అలా తలపోటు పుణ్యమా అంటూ చాలాసార్లు బైబిలు చదవగలిగాను. ఆ సమయంలో మా నాన్నగారు "నాన్న! నిన్ను మీ అమ్మ కడుపులో ఉండగానే దేవుని సేవకు సమర్పించుకుంది గనుక చదువు వదిలి సేవకు బయలుదేరు" అన్నారు. అది నాకు యిష్టం కాని విషయం అని మీకు తెలుసుగదా! అయినా ప్రార్థన చేసి బైబిలు కాలేజికి ట్రైచేస్తాను. కొద్దో గొప్పో బైబిలు విషయాలు తెల్సుకోకుండా ఏమి సేవచేయగలం అంటూ ఒక కార్డుముక్క వ్రాసి డూన్ బైబిల్ కాలేజికి పోస్ట్‌చేసాను. అక్కడ నుండి సమాధానం రాకూడదనే నా కోరిక. కాని నా కోరికకు వ్యతిరేకంగా నన్ను వెంటనే రమ్మని జవాబు వ్రాసారు. సహజంగా డూన్ బైబిల్ కాలేజిలో సీటు దొరకడం చాలా కష్టం ఆ రోజుల్లో. కాని ఏ రికమెండేషనూ లేకుండా నాకు ఫ్రీగా సీటు దొరికింది. ఇలా D.B.C నుండి రమ్మని లెటర్ వచ్చింది అని ఏ పాస్టరు గారికి చెప్పినా; అది చాలామంచి బైబిలు కాలేజి, చాలా పేరున్న కాలేజి, నీవు చాలా అదృష్టవంతుడివి ఆలస్యం చేయొద్దు పరుగెత్తమన్నారు. వెళ్ళాను. అది 3 సం॥రాల కోర్సు. పరీక్ష వ్రాయమన్నారు. వ్రాసాను పాసయ్యాను. గనుక నాకు ఒక సం॥ము తగ్గించి రెండు సం॥రాలలో కోర్సు పూర్తిచేసేలా వారు నాకు సీటు యిచ్చారు. రోజులు జరుగుతూ ఉండగా, సమస్యలు ఎదురవ్వుతున్నాయి. ఒకరోజు ఎవరికీ తెలియకుండా ఇంటికి వచ్చేద్దామని తలంచి, రాత్రి అందరూ నిద్రపోయాక నా సామానులన్నీ సర్దుకొని పెట్టెతీసుకొని గేటువరకు వచ్చాను అంతలో ఎవరో మరళా నాతో మాట్లాడుతున్నట్లు అనిపించింది. వెనక్కి తిరిగి చూసాను. ఎవరూ లేరు కాని నా వెనుక నుండే మాట్లాడుతున్నారు. **"పిరికివాడిలా పారిపోతున్నావా? నిన్ను ఎందుకు ఇక్కడికి తీసుకొచ్చానో నీకు తెలుసా? వెనక్కిరా! నీవు దిగులుపడవలసిందిలేదు. నీకు నేనున్నాను".**

ఆ మాటకు విధేయుడనై వెనక్కివచ్చి ఏడ్చి, ఏడ్చి ప్రార్థన చేసుకొని పండుకున్నాను. ఇంటర్మీడియట్ నుండి D.B.C వదిలేవరకూ నేను ఏడ్చిన రాత్రుళ్ళు ఎన్నో నాకూ - నా పరమతండ్రికే తెలుసు.

ఒకరోజు మంచం మీద పండుకొనగా ఒక కల వచ్చింది మంచం అంతా కాలిపోతుంది గాని నేను అదే మంచం మీద ఉన్నాను నేను కాలిపోవడం లేదు. మెళకువ వచ్చి ఏమిటిది! అని ఆశ్చర్యపడుతుండగా......నిర్గమ 3:1,2 గుర్తుకు వచ్చి వెంటనే మోకరిల్లి ప్రార్థించాను. తర్వాతనుండి నేను ఒంటరిగా జీవించడాన్కి ఇష్టపడేవాడిని. ఎందుకంటే మనుష్యులతో సహవాసం కన్నా, దేవునితో సహవాసమే నాకు ఎంతో నెమ్మది, తృప్తినిచ్చేది. బైబిలు కాలేజిలో కూడా నేను ఒక ప్రత్యేకమైన వ్యక్తిగానే ఉండేవాడిని.

బైబిలు కాలేజిలో చదువుతూ ఉన్నప్పుడు కూడా **బుస్సకొడుతున్న శబ్దం (Hissing Sound)** నాకు వినపడుతూ ఉండేది. నేనేమనుకున్నానంటే: పాస్టర్లకు చెపితే సాతాను అని అన్నారు కాని బైబిలు కాలేజీ టిచర్స్ని, ప్రిన్సిపాల్‌ని అడిగితే మంచిగా చెప్పొచ్చు అని ~~ఈ~~ **బుస్సకొడుతున్న శబ్దం (Hissing Sound)** గూర్చి ఒకరికి తెలియకుండా ఒకరిని మొత్తానికి అందరి టీచర్లనూ అడిగాను. కాని అందరూ దానిని పాస్టర్లు చెప్పినట్టుగానే సాతాను అని అన్నారు. కాని వారి సమాధానం నన్ను తృప్తిపరచలేకపోయింది. ఎలాగైనా బైబిల్ కాలేజిలో ఉండగానే ఆ శబ్దం సంగతి ఏమిటో తెల్సుకోవాలని పట్టుదల కలిగి; ఎంతైనా మా పేరెంట్స్ వెళ్ళే సంఘం అయిన " ది పెంతెకోస్తు మిషన్ " బ్రదర్ దగ్గరకు వెళ్ళి **బుస్సకొడుతున్న శబ్దం (Hissing Sound)** గూర్చి అడిగాను. ఎందుకంటే వీరు అందరినీ వదిలి దేవుని సేవకు వచ్చిన వ్యక్తులు. వివాహం కూడా నిషేదించి ఎంతో త్యాగం దేవుని కొరకు చేసిన వ్యక్తులు. వారి సమర్పణ కూడా చాలా గొప్పది అంటున్నారు కదా! వారు పరిశుద్ధాత్మ పొందినవారని చెప్తున్నారు గనుక అని వారిని అడిగాను. వారు కూడా సాతాను అనే చెప్పారు. వీళ్ళందరినీ వదిలి అసలు పరమతండ్రి / వాక్యము ఏమి చెప్తుందో తెల్సుకోవడం మంచిదని ప్రార్థన చేసి తెల్సుకున్నాను.

"హిస్సింగ్" అనగానే "బుస్సకొట్టుట" అనే అర్థం వస్తుంది గనుక అందరూ దానిని సాతాను/ఘటసర్పము అని వ్యాఖ్యానిస్తున్నారు. కాని వాస్తవానికి అది దాని కరెక్టు అర్థం కాదని నేను గ్రహించాను.

యెషయా (Isa) 5:26 "And he will lift up an ensign to the nations from far, and will **hiss** unto them from the end of the earth; and behold they shall come with speed swiftly,"

జెకర్యా 10:8 "I will **hiss** for them and gather them; for I have redeemed them: and they shall increase as they have increased." వచనముల ప్రకారం **బుస్సకొట్టుచున్న శబ్దం అంటే పరమతండ్రి ఈలవేసి పిలుచుచున్నాడని నేను గ్రహించాను.** తరువాత ఇదే విషయాన్ని నన్ను ఎగతాళి చేసిన వారికి చెపితే నోరుమూసుకున్నారు. అప్పుడు నేను ఏమనుకున్నానంటే " పెద్ద పెద్ద బోధకులమంటూ హడావిడి చేస్తున్న వీళ్ళకి బైబిలు గూర్చి లోతుగా తెలియదని, తెలియని విషయములను తెలిసినట్లుగా చెప్తున్న అబద్ధకులని" గ్రహించాను. అప్పటినుండి వాళ్ళను, వాళ్ళబోధను ఒక కంట కనిపెడుతూ ఉండేవాడిని. ఆవిధంగా అన్ని డినామినేషన్ల బోధలనూ పరిశీలించడం చేసాను. సత్యమనేది ఏదో ఉంది గాని వీళ్ళు చెప్పేది సత్యం కాదని గ్రహించాను అప్పటినుండి నేను స్వయముగా బైబిలును చదవడం, పరిశీలించడం చేస్తూవచ్చాను. నేను బైబిలు కాలేజిలో ఉండగానే అప్పటికి నాకున్న జ్ఞానమునుబట్టి ఒక స్టాంపు తయారు చేయించి అనేక మందికి నా గుర్తుగా దానినే వేసేవాడిని

**Except Christ none is right**
**Accept His light to cast away your night**
*Bro. Isaac E.Kusuma*

మా కాలేజి టీచర్స్ బాధపడ్డారు. మేమందరమూ తప్పుడు వాళ్ళమా? మరి మా దగ్గరకెందుకొచ్చావు నేర్చుకోడానికి అని అడిగిన టీచర్సూ ఉన్నారు. మనమెవరమూ పరిపూర్ణమైన వారము కాము. కాని దేవుడు పరిపూర్ణుడు. దేవుని ద్వారా మాట్లాడేవారు కూడా పరిపూర్ణులు కావాలనెడిది దేవుని ఆశ. గనుక నేను పరిపూర్ణంగా జీవించాలని పరిపూర్ణమైన బోధకోసం వెతుకుతున్న సత్యాన్వేషిని అని చెప్పేవాడిని. పరిపూర్ణమైనది వచ్చేవరకు అపరిపూర్ణంలోనే జీవిస్తాము. అది రాగానే పరిపూర్ణతలోనికి వెళతాము గనుక పరిపూర్ణమైన బోధ తెలిసినప్పుడు అపరిపూర్ణమైనది వదిలెయ్యాలి గదా! మీరెందుకు దానిని వదలక మీ డినామినేషనులను/మిషనులను పొగుడుకుంటూ కూర్చుంటున్నారు? అని అడిగేవాడిని. బోధ మార్చుకోలేక నన్ను చూసినపుడెల్లా బాధపడుతూ ఉండేవారు. దానికి నేను బాధ్యుడనా? వారికోసం నేను నా సత్యమును/నా బోధను మార్చుకోవాలా? మార్చుకోవలసిన పనిలేదు. నేను బోధించువాటికి ఆధారములు చూపించగలను. మీరు బోధించేదానికి ఆధారములు ఏవి? ఎక్కడ? ఏ బైబిల్లో చూపించగలరు? ఆది అపోస్తలులు ఏమి బోధించారు? నేటి బోధకులు ఏమి బోధిస్తున్నారు? పరిశీలించి చూడండి. బైబిలు మీ దగ్గరే ఉందిగదా! నా తప్పుని చూపించండి. లేదా మీ తప్పును సరిదిద్దుకోండి.

ఏ డినామినేషన్ బోర్డు తగిలించుకున్నా క్రైస్తవులకు గురువు-దైవం యేసుక్రీస్తే గదా! ఆయన అడుగుజాడల్లోనే గదా వారు నడవవలసింది? ఆయనను గూర్చిన పూర్తివివరాలు తెల్సుకోవలసిన బాధ్యత ప్రతీ విశ్వాసికీ లేదా? ప్రతీ డినామినేషను అపోస్తలుల పునాది మీదే ఉండాలి గదా? ప్రపంచంలో ఉన్న అన్ని క్రైస్తవ డినామినేషనులకు బైబిలు ఒక్కటే ప్రమాణిక గ్రంథం అయ్యినప్పుడు, ఆ బైబిలును గూర్చిన కనీస సేకరణ ప్రతీ విశ్వాసి చెయ్యాలిగదా? మరి ఎందుకు చెయ్యరు? బైబిలుకి కలపకూడదు, ఉన్నదానిని తీసివేయకూడదు అని బోధించే బోధకులే కలిపేసి-తీసేసి చెరిపేస్తూ ఉంటే సత్యమెరిగిన వారు ఎలా సహించగలరు? మెస్సీయ జననము-మరణము మొ॥నవి క్రైస్తవులకు సరిగా తెలుసా? వాటి వాక్యాధారములు చూపగలరా? ఎదుటి వారిని అబద్ధబోధకులు అనడం చాలా సులభం. కాని వారే అబద్ధబోధకులేమోనని ఎందుకు తమలో తాము స్వపరీక్ష చేసుకోరు? అపోస్తలులు బోధించినబోధ, ఆరాధించినదినము, ఇవ్వబడినబాప్తిస్మములు మొ॥గు పునాది సిద్ధాంతములు బైబిల్లో ఉన్నాయి. వాటినే ప్రతీ విశ్వాసి తెల్సుకొని ఆ ప్రకారంగా జీవిస్తూ నడిచిపోవాలి. అవి వదిలేసి రకరకాల డినామినేషన్స్ బోర్డులు తగిలించుకొని, ఇది మా విశ్వాసము, అది వాళ్ళ విశ్వాసము అనునది వీరి చేస్తున్న తప్పు. ఏదైనా ఒక విషయాన్ని తెల్సుకోవాలనుకున్నప్పుడు, దాని పుట్టుపూర్వోత్తరాలు ముందుగా తెలుసుకోవాలి. సువార్తయొక్క పుట్టుపూర్వోత్తరములు చూస్తారా? సువార్త ఎక్కడ పుట్టింది? ఎవరు చేయమన్నారు? ఎవరికి చేయమన్నారు? పరిశీలించండి. 40-70 సం॥రాల నుండి క్రైస్తవులం అని చెప్పుకునే వారు సహితం మెస్సీయ ఎప్పుడు పుట్టాడో చెప్పండి అంటే చెప్పలేకపోతున్నారు. పోనీ ఎప్పుడు చనిపోయాడో చెప్పండి? ఆయన

ఏ బాష మాట్లాడాడో చెప్పండి? సువార్త ఎక్కడనుండి చేయమన్నాడో చెప్పండి? ఆయన అనుసరించమన్న విధానాలు చెప్పండి? లేక ఆఖరికి ఎవరినైనా పలుకరించేటప్పుడు ఏ విధంగా పలకరించమన్నాడో చెప్పండి అంటే ఈ నామకార్ధ డినామినేషన్ క్రైస్తవులు చెప్పలేకపోతున్నారు. ఎందుకని? వీరంతా బైబిల్లో ఏముందో, ఏమని చెప్పమని ఉందో తెల్సుకోలేదు. పోనీ ఎవరైనా తెల్సుకొని చెపితే : వినరు పైగా వారిని ఎగతాళి చేస్తూ ఉంటారు. అది మంచిపని అంటారా? ఇతర మతాల నుండి ఎవరైనా మార్పుచెంది క్రైస్తవ్యమును అంగీకరిస్తే, వారి మత, కుల పడికట్లు అన్నీవదిలి రావాలని కోరుకుంటారు. మరి వీరు ఎందుకు వారి మతకట్లు/డినామినేషన్ కట్లు/వదిలిరారు?

ఒక మంచి భక్తురాలు "Praise The Lord!" బ్రదర్ అంది. నేను షలోం సిస్టర్ అన్నాను. ఆవిడ చాలా అభ్యంతరపడిపోయి: షలోం అంటే ఏమిటి? అని అడిగింది. “మీకు సమాధానము కలుగును గాక” అని అర్ధం అన్నాను. ఏ బాషలో అని అడిగింది. హెబ్రీ బాషలో అన్నాను. నాకు హెబ్రీ రాదు, నేను హెబ్రీయురాలను కాను అంది. హెబ్రీ రానవసరంలేదు అన్నాను. ఈ రోజు క్రైస్తవులంతా హల్లెలూయ-ఆమెన్ అని అంటున్నారు. వారందరికీ హెబ్రీ వచ్చునా? వారందరూ హెబ్రీ నేర్చుకోవాలా? అవసరలెద్దు. ఎందుకంటే అన్నిడినామినేషన్ వారు హెబ్రీయుల దేవుణ్ని ఆరాధిస్తున్నారు. బైబిల్లో మెస్సీయ "Praise The Lord" అని చెప్పమనలేదు గాని “షలోం” అని చెప్పమన్నాడని చూపించాను. లూకా 10:5,6. మెస్సీయ అపోస్తలులు “షలోం” అనే సంబోధించారు. లూకా 24:36. “వందనములు” అని తెలుగులో వ్రాయబడిన ప్రతీచోట హెబ్రీలో “షలోం” అని వ్రాయబడింది. గనుక “షలోం” అని పలకరించడం అపోస్తలుల మాదిరి. "Praise The Lord" అని పలకరించుట ఎవరి మాదిరి? బైబిల్లో ఎవరు ఆ విధంగా పలకరించమని చెప్పారు? నాకు వాక్యం చూపించమని అడిగాను. చూపిస్తాను అంది. కాని ఇంతవరకూ చూపించలేదు. పోనీ మీ పాస్టరు గారిని అడిగి చూపించమన్నాను. ఇంతవరకూ సమాధానం లేదు. మెస్సీయ చెప్పినట్లుగా (లూకా 10:5,6), పలకరించినట్లుగా (లూకా 24:36), పలకరించడం చేతకాని క్రైస్తవులకు మెస్సీయ చెప్పిన లోతైన విషయములు ఏమి తెలుసు? మెస్సీయ వదిలివెళ్ళిన అడుగుజాడలు ఏమితెలుసు? గనుక ఎంతసేపూ ఎదుటి వారిలో తప్పులు పట్టడాన్కి చూడడం కాదు గాని మీలో ఏమి తప్పు ఉందో పరిశీలించి స్వపరీక్ష చేసుకోవడం మంచిది. సమస్తమూ పరిశీలించి మేలైన దానిని చేపట్టండి.

సువార్త యరూషలేములో మొదలయ్యింది. మెస్సీయ కాలంలో (BC 04 - AD 31) ఇశ్రాయేలు దేశంలో సువార్త ప్రారంభం అయ్యింది. ఆ సువార్త మొదట యరూషలేములోను, యూదయలోను, సమరయలోను, తరువాత భూదిగంతములవరకూ వ్యాపించుచున్నది(అ॥కార్య 1:8). మెస్సీయ తన సువార్తను భూదిగంతములవరకూ ( అ॥కార్య 13:47) ప్రకటించమని చెప్పాడు. యరూషలేములోనుండి పరమతండ్రి వాక్యము (యెషయా 2:3, మీకా 4:2) బయలు వెళ్ళింది. అది అక్కడనుండి యూదయ, సమరయ, భూదిగంతములకు వ్యాపించవలసి ఉంది. యరూషలేములో ఆయనను **"యుషువ మెస్సీయ"** అని అన్నారు. మొదటి శతాబ్దంలో ఆయన **"యుషువ మెస్సీయ"** అనే పిలువబడ్డాడు. అపోస్తలులు ఐమీన్ ఆది అపోస్తలులు బోధించిన నామము **"యుషువ మెస్సీయ"**. ఈ నామము తప్పు అని ఏ క్రైస్తవ డినామినేషన్ వారైనా ఋజువుచేయగలరా? క్రైస్తవ బోధకులు పెద్దపెద్ద డిగ్రీలు తగిలించుకుని మహాఘనత వహించిన స్థానములలో ఉన్నారు. గనుక నేను వ్రాసిన **"యుషువ మెస్సీయ"** అను నామము అపోస్తలులు బోధించినది అబద్ధమని చెప్పగలరా? మీదగ్గర ఏమైనా ఋజువులు ఉన్నాయా? నా దగ్గర హెబ్రీ, గ్రీకు, ఇంగ్లీషు, తెలుగు బైబిళ్ళు ఉన్నాయి. ఈ నాలుగు బైబిళ్ళు దగ్గర పెట్టిచూడండి, సత్యము చాలా తేలికగా మీకు తెలుస్తుంది.

**"యుషువ మెస్సీయ"** అని మేము అనగానే అబద్ధబోధకులు అనడాన్కి క్రైస్తవ బోధకులకు ఎక్కడుంది ఆధారం? ఆది అపోస్తలుల బోధకు విలువ ఇస్తున్నాం అని చెప్పే పెంతెకోస్తు, యేసునామం, ఫెలోషిప్ వారు సహితం **"యుషువ మెస్సీయ"** అంటే కంగారు పడవలసిన పని ఏమిటి? మొదటి శతాబ్దంలో ఆయనను ఏమని పిలిచారో మీకు తెలియదా? “యేసుక్రీస్తు” అని మాత్రం పిలవలేదు. ఎందుకంటే తెలుగు బైబిలు 1712-1953లో వచ్చింది గనుక. తెలుగు బైబిలు 1700 లో వస్తే మొదటి శతాబ్దంలో “యేసుక్రీస్తు” అనే పదం అపోస్తలులకు ఎలా తెలుస్తుంది? గనుక ఆలోచించండి. అపోస్తలుల కాలంలో కంప్యూటర్ ఉందంటే మీరు నమ్ముతారా? అపోస్తలుడైన సౌలు విమానంలో ప్రయాణం చేసాడంటే నమ్మశక్యమా? అటులనే మీరు చెప్పే “యేసుక్రీస్తు” నామం అపోస్తలులకు తెలియదు. మా పేరెంట్స్ నమ్మిన మిషను సత్యమును బోధించుటలేదు గనుకనే మేము దానిని వదిలి సత్యమును వెంబడించుచున్నాము. మిషనులను/డినామినేషనులను నమ్మితే అగ్నిగుండానికి వెళ్ళవలసి ఉంటుంది. ప్రతీ డినామినేషను విశ్వాసి బైబిలును మాత్రమే నమ్మాలి. వాక్యమునకు మాత్రమే 100% ప్రాముఖ్యత నివ్వాలి. మిషనులో ఏదో స్థానం దొరుకుతుందని, పెళ్ళిళ్ళు అవుతాయని, చనిపోతే పాతిపెట్టడాన్కి స్థలం ఇస్తారని మొ॥గు సాకుల కొరకే అయితే మీరు మీ మిషనులలోనే ఉండండి. సత్యాన్వేషులు మిషనులలో ఉండరు. ఎందుకంటే మిషనులు సత్యమును బోధించవు. బోధించువారిని వారిదరికి రానివ్వవు. పోనీ వారు మారతారా అంటే మారరు. గనుక సత్యమనునది మిషనులలో దొరకదు. నేనే మార్గము, సత్యము, జీవమునైయున్నానని యుషువ మెస్సీయ చెప్తున్నాడు. నా ద్వారా తప్ప ఎవడును తండ్రియొద్దకు రాలేరని మెస్సీయ చెప్తున్నాడు. గనుక ఆయనను వెంబడించి పరలోకం వెళ్ళాలా? లేక మన డినామినేషనులననుసరించి వెళ్ళాలా? నేడైనా ఆలోచించి మంచినిర్ణయం తీసుకోండి. మేము సబ్బాతుని ఆచరించడానికి గల కారణం అది యుషువ మెస్సీయ మరియు అపోస్తలుల మాదిరి గనుక (1పేతురు 2:21, 1కొరింథీ 11:1) అంతేగాని ఎవరో సెవంత్‌డే వారు మాకు డబ్బులిచ్చి ఈ బోధ చేయించుట లేదు, లేక డబ్బు కోసం ఈ సేవ చేయుటలేదు. చూడండి:

**BC 04 లో యుషువ మెస్సీయ పర్ణశాలల పండుగ దినములలో పుట్టాడు**

**AD 31 లోయుషువ మెస్సీయ పస్కాపండుగ దినమున చనిపోయాడు**

పస్కాపండుగ బైబిలు క్యాలెండరు ప్రకారం 1వ నెల నీసాన్ 14వ తేదీన వచ్చును. లేవీ 23:5, సంఖ్యా 28:16 యుషువ మెస్సీయ నీసాను 14 పస్కారోజున మరణించగా ఆది సమాజము నీసాను 17 శనివారం సబ్బాతును కూడినది (లూకా 23:56). పస్కా పండుగ దినములలో వచ్చు వారపు విశ్రాంతిదినమైన సబ్బాతులనుండి 7 సబ్బాతులు తర్వాత పెంతెకోస్తు పండుగ వచ్చును. క్రింది పట్టికలో చూడండి:

| 1వ దినము ఆదివారము | 2వ దినము సోమవారము | 3వ దినము మంగళవారము | 4వ దినము బుధవారము | 5వ దినము గురువారము | 6వ దినము శుక్రవారము | 7వ దినము శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | నీసాను 14 మరణించుట | నీసాను 15 | నీసాను 16 | నీసాను 17 లేచుట |
| నీసాను 18 1 | నీసాను 19 2 | నీసాను 20 3 | నీసాను 21 4 | నీసాను 22 5 | నీసాను 23 6 | నీసాను 24 7 |
| నీసాను 25 8 | నీసాను 26 9 | నీసాను 27 10 | నీసాను 28 11 | నీసాను 29 12 | నీసాను 30 13 | జీవ్ 1 14 |
| జీవ్ 2 15 | జీవ్ 3 16 | జీవ్ 4 17 | జీవ్ 5 18 | జీవ్ 6 19 | జీవ్ 7 20 | జీవ్ 8 21 |
| జీవ్ 9 22 | జీవ్ 10 23 | జీవ్ 11 24 | జీవ్ 12 25 | జీవ్ 13 26 | జీవ్ 14 27 | జీవ్ 15 28 |
| జీవ్ 16 29 | జీవ్ 17 30 | జీవ్ 18 31 | జీవ్ 19 32 | జీవ్ 20 33 | జీవ్ 21 34 | జీవ్ 22 35 |
| జీవ్ 23 36 | జీవ్ 24 37 | జీవ్ 25 38 | జీవ్ 26 39 | జీవ్ 27 40 | జీవ్ 28 41 | జీవ్ 29 42 |
| సీవాన్ 1 43 | సీవాన్ 2 44 | సీవాన్ 3 45 | సీవాన్ 4 46 | సీవాన్ 5 47 | సీవాన్ 6 48 | సీవాన్ 7 49 |
| సీవాన్ 8 50 పెంతెకోస్తు | | | | | | |

| | | |
|---|---|---|
| | నీసాను 14 | మెస్సీయ మరణదినం    నీసాను 17 మెస్సీయ పునరుత్థాన దినము |
| | నీసాను 17 | సమాజం సబ్బాతుకు కూడిన దినము    లూకా 23:56 |
| 1. | నీసాను 24 | ఒక వారపు విశ్రాంతిదినము |
| 2. | జీవ్ 1 | రెండవ వారపు విశ్రాంతిదినము |
| 3. | జీవ్ 8 | మూడవ వారపు విశ్రాంతిదినము |
| 4. | జీవ్ 15 | నాలుగవ వారపు విశ్రాంతిదినము |
| 5. | జీవ్ 22 | ఐదవ వారపు విశ్రాంతిదినము |
| 6. | జీవ్ 29 | ఆరవ వారపు విశ్రాంతిదినము |
| 7. | సీవాన్ 7 | ఏడవ వారపు విశ్రాంతిదినము |
| | | 7×7=49+1 = 50 పెంతెకోస్తు పండుగ దినము |
| | సీవాన్ 8 | ఆదివారము పెంతెకోస్తు పండుగ |

అపోస్తలులందరు విశ్రాంతిదినముననే ఆరాధనకు కూడియున్నారు. ఆది అపోస్తలుల కాలంలో అక్కడ ఉన్న సమాజములన్నియు విశ్రాంతిదినముననే ఆరాధనకు కూడినవి. ఇవిగో వాటి ఋజువులు:

## ఆది అపోస్తలులు విశ్రాంతిదినమును ఆచరించిన సమాజములు:

| | | |
|---|---|---|
| 1. | నీసాను 17 (లూకా 23:56) | మెస్సీయ మరణానంతరం సమాజము |
| 2. | నీసాను 24 | ఒక వారపు విశ్రాంతిదినము |
| 3. | జీవ్ 1 | రెండవ వారపు విశ్రాంతిదినము |
| 4. | జీవ్ 8 | మూడవ వారపు విశ్రాంతిదినము |
| 5. | జీవ్ 15 | నాలుగవ వారపు విశ్రాంతిదినము |
| 6. | జీవ్ 22 | ఐదవ వారపు విశ్రాంతిదినము |
| 7. | జీవ్ 29 | ఆరవ వారపు విశ్రాంతిదినము |
| 8. | సీవాన్ 7 | ఏడవ వారపు విశ్రాంతిదినము |
| 9. | సీవాన్ 8 (అ॥కార్య 2:1) | పెంతెకోస్తు పండుగ విశ్రాంతిదినమ |
| 10. | అ॥కార్య 3:1 | పెంతెకోస్తు పండుగ దినము |
| 11. | అ॥కార్య 8:1 | యరూషలేములోని సమాజము |
| 12. | అ॥కార్య 8:27 | నపుంసకుడు ఆరాధించుటకు వచ్చిన సమాజము |
| 13. | అ॥కార్య 9:2,20 | దమస్కు సమాజమందిరములు |
| 14. | అ॥కార్య 9:28 | యరూషలేములోని సమాజములు |
| 15. | అ॥కార్య 9:31 | యూదయ, గలలియ, సమరయ సమాజములు |
| 16. | అ॥కార్య 11:22 | యరూషలేములోని సమాజము |
| 17. | అ॥కార్య 13:1 | సిరియాలోని అంతియొకయ సమాజము |
| 18. | అ॥కార్య 13:5 | సలమీ సమాజమందిరము |
| 19. | అ॥కార్య 13:14,42,44 | పిసిదియలోని అంతియొకయ సమాజము |
| 20. | అ॥కార్య 13:27 | యరూషలేములో సమాజమందిరములు |
| 21. | అ॥కార్య 14:1 | ఈకొనియలోని సమాజమందిరము |
| 22. | అ॥కార్య 14:23 | లుస్త్ర, దెర్బె, ఈకొనియ సమాజములు |
| 23. | అ॥కార్య 14:25 | పెర్గెలో సమాజమందిరము |
| 24. | అ॥కార్య 14:27 | అంతియొకయ సమాజమందిరము |
| 25. | అ॥కార్య 15:3 | అంతియొకయ సమాజము |
| 26. | అ॥కార్య 15:21 | ప్రతి పట్టణములోని సమాజములు |
| 27. | అ॥కార్య 15:22 | యరూషలేములోని సమాజము |
| 28. | అ॥కార్య 15:23 | అంతియొకయ, సిరియ, కిలికియ సమాజములు |
| 29. | అ॥కార్య 16:5 | సమాజమందిరములు |
| 30. | అ॥కార్య 16:13 | ఫిలిప్పీలోని సమాజమందిరము |
| 31. | అ॥కార్య 17:1,2 | థెస్సలోనీక సమాజమందిరము |
| 32. | అ॥కార్య 17:10 | బెరయలో సమాజమందిరము |
| 33. | అ॥కార్య 17:17 | ఏథెన్సులోని సమాజమందిరములు |
| 34. | అ॥కార్య 18:4 | కొరింథులోని సమాజమందిరము |
| 35. | అ॥కార్య 18:18 | కేంక్రెయలోని సమాజమందిరము |
| 36. | అ॥కార్య 18:19 | ఎఫెస్సులోని సమాజమందిరము |
| 37. | అ॥కార్య 18:23 | గలతీయ, ఫ్రుగియ సమాజములు |
| 38. | అ॥కార్య 18:25 | ఎఫెస్సులోని సమాజమందిరము |
| 39. | అ॥కార్య 18:27 | అకయ సమాజములు |
| 40. | అ॥కార్య 19:8 | ఎఫెస్సు సమాజమందిరము |
| 41. | అ॥కార్య 20:6 | త్రోయ సమాజమందిరము |
| 42. | అ॥కార్య 20:15 | అస్సు, మిలేతు సమాజమందిరములు |
| 43. | అ॥కార్య 20:18 | ఆసియలో సమాజమందిరము |
| 44. | అ॥కార్య 21:3,4 | తూరులో సమాజము |
| 45. | అ॥కార్య 21:7 | తోలెమయి సమాజము |
| 46. | అ॥కార్య 21:8 | కైసరియలోని సమాజము |
| 47. | అ॥కార్య 21:17 | యరూషలేము సమాజము |
| 48. | 1కొరింథి 16:19 | ఆసియలోని సమాజములు |
| 49. | రోమా 16:4 | అన్యజనులలోని సమాజములు |

**ఇంట ఉన్న సమాజములు:**

| | | |
|---|---|---|
| 1. | రోమా 16:4<br>1కొరింథి 16:19 | అకుల - ప్రిస్కిల్ల ఇంట ఉన్న సమాజము |
| 2. | ఫిలేమోను 1:2 | ఫిలేమోను ఇంట ఉన్న సమాజము |
| 3. | కొలస్సి 4:15 | సుంఫా ఇంట ఉన్న సమాజము. |

## ఆది అపోస్తలులు ఇచ్చిన బాప్తీస్మములు:

యుషువ మెస్సీయ తన శిష్యులకిచ్చిన ఆజ్ఞలలో సువార్త చేసిన తరువాత తండ్రియొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి బాప్తీస్మము ఇవ్వమనుట. తండ్రి పేరు కాదు, కుమారుడు పేరు కాదు, పరిశుద్ధాత్మ పేరుకాదు. కాని, తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు **నామము =** యుషువ మెస్సీయ. కావున అపోస్తలులు యుషువ మెస్సీయ నామమున బాప్తీస్మములిచ్చిరి. ఇవిగో ఋజువులు.

1. పేతురు - మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తం ప్రతీవాడు యుషువ మెస్సీయ నామమున బాప్తిస్మం పొందుడి, అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు (అ॥కార్య 2:38) (S.N.Bible)
2. కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తీస్మము పొందిరి (అ॥కార్య 2:41)(S.N.Bible)
3. ఈ నామమునే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము అనెను (అ॥కార్య 4:12) (S.N.Bible) ఆ నామము యుషువ మెస్సీయయే.
4. యుషువ మెస్సీయ నామమందు వారు బాప్తీస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను. (అ॥కార్య 10:48)(S.N.Bible)
5. గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థన చేసి బాప్తీస్మము పొంది నీపాపములను కడిగివేసుకొనుమని చెప్పెను. అ॥కార్య 22:16) (S.N.Bible)

**పొందిన వారి ఋజువులు:**

| | | |
|---|---|---|
| 1. | యోహాను ఇచ్చెను | యోహాను 1:26 |
| 2. | యుషువ ఆయన శిష్యులు ఇచ్చెను | యోహాను 3:22, 4:1,2,3 |
| 3. | 3000మంది పొందారు | అ॥కార్య 2:38,41 |

| | | |
|---|---|---|
| 4. | పురుషులు/స్త్రీలు పొందారు | అ॥కార్య 8:12 |
| 5. | సీమోను పొందాడు | అ॥కార్య 8:13 |
| 6. | సమరయులు పొందారు | అ॥కార్య 8:14:16 |
| 7. | నపుంసకుడు పొందాడు | అ॥కార్య 16:14,15 |
| 8. | కొర్నేలి ఇంటివారు పొందాంరు | అ॥కార్య 10:47,48 |
| 9. | లూదియా ఇంటివారు పొందారు | అ॥కార్య 16:14,15 |
| 10. | చెరసాల నాయకుని ఇంటివారు పొందారు | అ॥కార్య 16:30-33 |
| 11. | కొరింథీయులు పొందారు | అ॥కార్య 18:8 |
| 12. | అపొల్లో పొందాడు | అ॥కార్య 18:24,26,28 |
| 13. | యోహాను శిష్యులు పొందారు | అ॥కార్య 19:5 |
| 14. | సౌలు పొందాడు | అ॥కార్య 22:16 |
| 15. | రోమీయులు పొందారు | రోమా 6:3 |
| 16. | క్రిస్పు, గాయి పొందారు | 1కొరింథీ 1:15 |
| 17. | స్తెఫను ఇంటివారు పొందారు | 1కొరింథీ 1:16 |
| 18. | గలతీయులు పొందారు | గలతీ 3:27 |

- బాప్తీస్మము పాపక్షమాపణ నిమిత్తము (అ॥కార్య 2:38),
- పాపములను కడుగుకొను నిమిత్తము (అ॥కార్య 22:16)
- రక్షణ నిమిత్తము (1పేతురు 3:21)
- మెస్సీయను ధరించుకొను నిమిత్తము (గలతీ 3:27)
- మెస్సీయ మరణములో పాలు పొందుట (రోమా 6:4)

## ఆది అపోస్తలులు ఉపయోగించిన బైబిలుక్యాలెండరు:

పరమతండ్రియైన యావెయొక్క నియామకకాలములు (లేవీ 23వ అధ్యాయము, యోబు 24:1) బైబిల్ క్యాలెండరును బట్టి మాత్రమే వచ్చును. కనుక బైబిలు క్యాలెండరు తప్పనిసరిగా తెలుసుకొనవలసి ఉన్నది. బైబిల్ క్యాలెండర్ యొక్క ఋజువులు ఇవిగో:

| బైబిల్ నెలలు | దినములు | రిఫరెన్సు | ప్రపంచ క్యాలెండర్ |
|---|---|---|---|
| 1వ నెల నీసాను/అబీబు | 30 | ఎస్తేరు3:7 | మార్చి-ఏప్రిల్ |
| 2వ నెల జీఫ్/ఇయ్యార్ | 29 | 1రాజు6:1 | ఏప్రిల్-మే |
| 3వ నెల సీవాను | 30 | ఎస్తేరు 8:9 | మే-జూన్ |
| 4వ నెల తమ్మూజు | 29 | జెకర్యా 8:19 | జూన్-జూలై |
| 5వ నెల అవ్ | 30 | యిర్మీ 52:12 | జూలై-ఆగష్టు |
| 6వ నెల ఏలూలు | 29 | నెహె 6:15 | ఆగష్టు-సెప్టెంబర్ |
| 7వ నెల ఏతనీము/టిష్రీ | 30 | 1రాజు 8:2 | సెప్టెంబర్-అక్టోబర్ |
| 8వ నెల బూలు/మార్హెసెవాన్ | 29 | 1రాజు 6:38 | అక్టోబర్-నవంబర్ |
| 9వ నెల కిస్లేవు | 30 | జెకర్యా 7:1 | నవంబర్-డిశెంబర్ |
| 10వ నెల టెబెత్ | 29 | ఎస్తేరు 2:16 | డిశెంబర్-జనవరి |
| 11వ నెల శెబాటు | 30 | జెకర్యా 1:7 | జనవరి-ఫిబ్రవరి |
| 12వ నెల ఆదారు | 29 | ఎస్తేరు 3:13 | ఫిబ్రవరి-మార్చి |

యావెయొక్క నియామక కాలములు+పండుగలు బైబిల్ క్యాలెండరుననుసరించి వచ్చును.

| | | |
|---|---|---|
| 1. వారపు విశ్రాంతిదినము................................ | | లేవీ 23:3 |
| 2. పస్కా పండుగ................................ | నెల 14 వతేదీ | లేవీ 23:5 |
| 3. పులియనిరొట్టెల పండుగ................................ | 1 నెల 15-21 | లేవీ 23:6-8 |
| 4. వారముల పండుగ................................ | 3వ నెలలో ఒకరోజు | లేవీ 23:9-22 |
| 5. జ్ఞాపకార్థ శృంగధ్వని పండుగ................................ | 7వ నెల 1వతేదీ | లేవీ 23:23-25 |
| 6. పాపప్రాయశ్చిత్తార్థ దినము................................ | 7వ నెల 10 వతేదీ | లేవీ 23:26-32 |
| 7. పర్ణశాలల పండుగ................................ | 7వ నెల 15-21 | లేవీ 23:33-44 |
| 8. అంత్యమహాదినము................................ | 7వ నెల 22 వతేదీ | లేవీ 23:36. |

పాతనిబంధనలో చెప్పబడిన ఈ పండుగలు క్రొత్త నిబంధనలో యషువ మెస్సీయ మరియు అపోస్తలుల ద్వారా ఆచరించబడినవి, అచరించమని కూడా చెప్పబడినవి. అంతేకాదు అవి దేనికి సాదృశ్యముగా ఇవ్వబడెనో ఈ క్రింది లేఖనములు తెలియపరచుచున్నవి. కావున పండుగలను గూర్చిన ఋజువులు ఇవిగో:

| | | |
|---|---|---|
| 1. పస్కా పండుగ<br>లేవీ. 23:5 | - | మెస్సీయ మరణ దినమునకు సాదృశ్యం.<br>రొట్టె-ద్రాక్షరసం తీసుకుంటూ పాద ప్రక్షాళనతో ఆచరించవలసిన పండుగ. నిర్గమ13:10,లూకా2:41, 1కొరింథీ 5:7,8, మత్తయి26:1-30, మార్కు14:1-25, లూకా22:1-23, యోహాను12:1,13:1-35, అ॥కా॥12:4,20:6, 1కొరిందీ. 11:23-31. |
| 2. పులియని రొట్టెల పండుగ<br>లేవీ. 23:6-8 | - | అ॥కార్య. 12:3, 20:6, 1కొరింథీ.5:8.<br>పులిపిండిలేని ఆత్మీయ జీవితంను గూర్చియిది తెలియపరుస్తున్న పండుగ. |
| 3. వారముల పండుగ<br>(పెంతెకోస్తు పండుగ)<br>లేవీ. 23:9-21 | - | అ॥కార్య. 2:1, 20:16, 1 కొరింథీ16:9<br>అపోస్తలులంతా ఆచరించిన పండుగ ఇది.<br>సౌలు ఈపండుగకు త్వరపడుచూ యెరూషలేంనకు వెళ్ళుచున్నట్లు చూడగలము. |
| 4 జ్ఞాపకార్థ శృంగధ్వని పండుగ<br>లేవీ. 23:23-25 | - | ఇది మెస్సీయా రెండవ రాకడను తెలియజేయు.<br>పండుగ. 2 థెస్స 4:16. |
| 5. పాప ప్రాయాశ్చిత్తార్థ పండుగ<br>(ఉపవాస దినము)<br>లేవీ. 23:26-32 | - | మెస్సీయా రక్తం ద్వారా మన పాప ప్రాయశ్చిత్తార్థమును తెలియజేయు పండుగ.<br>అ॥కార్య॥ 27:9. |
| 6. పర్ణశాలల పండుగ<br>(గుడారముల పండుగ)<br>లేవీ. 23:33-35,39-44 | - | యోహాను 7:2-14,37<br>అ॥కార్య॥ 18:21 ఇంగ్లీషు బైబిల్లో చదవండి. తెలుగు బైబిలులో ఈ వాక్యం లేదు. మెస్సీయా జన్మదినమును సూచిస్తుంది. |
| 7. అంత్య దినమైన మహదినము<br>లేవీ. 23:36+39 | - | యోహాను 7:37ఇది రాబోయే తీర్పుదినమునకు సాదృశ్యమై యున్న దినము. |
| 8. వారపు విశ్రాంతిదినం<br>లేవీ. 23:3 | - | మెస్సీయ, అపోస్తలులు ఆచరించారు.<br>మత్తయి. 24:20, హెబ్రీ 4:9 |
| 9. నెలపొడుపు విశ్రాంతిదినము<br>సంఖ్యా10:10 | | ఆచరించమని వ్రాయబడింది.<br>కొలస్సీ 2:16,17 |

మొదటిశతాబ్దంలో అపోస్తలులు ఎవరూ క్రైస్తవులని పిలువబడలేదు. వారంతా యూదులు ఇశ్రాయేలీయులు మాత్రమే. పునాది సిద్ధాంతములు ఎరుగకుండా మాట్లాడుట మంచిది కాదు. గనుక క్రైస్తవులంటే ఎవరో ఇప్పుడు చూద్దాం:

క్రైస్తవుడు లేక క్రైస్తవులు అనే పదము కేవలం కేథలిక్స్ నుండి మాత్రమే ఉద్భవించినవి. దానిని పట్టుకునే ప్రొటెస్టంటులు వేలాడుతున్నారు. నిజానికి మొట్టమొదటి శతాబ్ధంలోని వారెవరూ క్రైస్తవులుగా పిలవబడలేదు. కేథలిక్ మరియు ప్రొటెస్టంటు వారి బైబిల్లో ఈ పదము మూడు చోట్ల వ్రాయబడినది. (1) అ॥కార్య॥ 11:26, (2) అ॥కార్య॥ 26:27,28, (3) 1పేతురు 4:16.

**క్రీస్తు అనే పదమును బట్టియే క్రైస్తవులు అన్నారు.** హెబ్రీయులకు (ఇశ్రాయేలీయులు+యూదులు) ఆయన మెస్సీయగా మాత్రమే తెలుసు. వాళ్ళంతా మెస్సీయ వస్తాడని ఎదురు చూచారే గాని క్రీస్తు కొరకు కాదు. **మెస్సీయ క్రీస్తు కాదు. క్రీస్తు మెస్సీయ కాదు.** దానియేలు 9:25 ని పరిశీలిస్తే "అభిషిక్తుడగు అధిపతి ఫుట్‌నోట్‌లో మెస్సీయ అని వ్రాయబడిఉంది. మెస్సీయ అంటే అభిషిక్తుడని వ్రాయబడిఉంది. మెస్సీయ అనేది హెబ్రూ పదము. మెస్సీయ హెబ్రీయుల ఎలోహీంగా పిలువబడినాడు(నిర్గమ5:3, 7:16, 9:4,13).

ధర్మశాస్త్రము, ప్రవక్తల వచనములు అన్నియూ హెబ్రీ భాషలోనే వ్రాయబడినవి. భూమి యందంతటను ఒక్క భాష ఒక్క పలుకు ఉండెను (ఆది 11:1) గనుక సృష్టికర్తయైన యావె హెబ్రీ భాషనే మొదట పలికినట్లు మనకు ఋజువవుతుంది. ఆఖరికి దమస్కురోడ్డులో సౌలును పడగొట్టిన యషువ మెస్సీయ తన పేరును హెబ్రీ భాషలోనే చెప్పినట్లుగా ఈ క్రింది రిఫరెన్సులు ఋజువు చేయుచున్నవి. (అ.కార్య.9:4, 22:7, 26:14) సౌలు కూడా హెబ్రీ భాషలోనే మాట్లాడినపుడు ఇశ్రాయేలీయులు నిశబ్ధముగా ఉన్నారని అ.కార్య. 22:2 ఋజువు పరుస్తుంది.

మెస్సీయను వెంబడించిన శిష్యులందరూ హెబ్రీయులే గనుక ఆయన వారికి మెస్సీయగానే తెలుసు గాని క్రీస్తుగా కాదు. అయితే **"క్రీస్తనబడిన మెస్సీయ"** అని యోహాను 4:25లో వ్రాయబడినది. **"క్రీస్తనబడిన"** అనే ఈ పదం కలుపబడినది. మెస్సీయ అనే పదమును లేక బిరుదును మరుగు చేయడానికి ఉపయోగించిన పదమే ఈ "క్రీస్తనబడిన" పదం. ఖచ్చితంగా చెప్పాలంటే ఆయన "మెస్సీయ" యే గాని "క్రీస్తనబడిన మెస్సీయ" కాదు కానేరదు.

**ఈ "క్రీస్తనబడిన" అనే కలుపబడిన పదమునుండే క్రైస్తవులు అనేపదం వచ్చింది;** అటులనే వేరొక కలుపబడిన పదం కూడా చూద్దాం.

**"పౌలు అనబడిన సౌలు"** (అ.కార్య. 13:9). **"పౌలు అనబడిన"** అనే ఈ మాట కలుపబడినది. సౌలు అనే హెబ్రీపదమును / పేరును మరుగుచేయడానికి **"పౌలు అనబడిన"** అని మార్చారు.

మెస్సీయ సౌలును, సౌలా! సౌలా! అనే పిలిచాడు. చదవండి ఈ వాక్యాలు (అ.కార్య. 9:4,11, 22:7, 26:14) అననీయ ద్వారా బాప్తిస్మం పొంది సువార్త ప్రారంభించాక కూడా ఆయన సౌలుగానే వ్రాయబడ్డాడు. (అ.కార్య. 9:11,17,22,24, 11:25,30, 12:25, 13:1,2,7). అ.కార్య. 13:9 నుండి మాత్రం సౌలు అనే ఆయన అసలుపేరును మరుగుచేసేసి పౌలుగా వ్రాసేసారు. అటులనే మెస్సీయ అనే ఆయన అసలు బిరుదును లేక పదమును మరుగుచేసి క్రీస్తుగా వ్రాసేసారు. **ఆయన శిష్యులు ఆయనను మెస్సీయను కనుగొంటిమి అని అన్నారేగాని క్రీస్తును కనుగొంటిమి అని అనలేదు. (యోహాను 1:41).**

మెస్సీయ అనుమాటకు అభిషిక్తుడని అర్థము (యోహాను 1:42) యోహాను 1:42 లోని అభిషిక్తుడని అనే మాటకు ఫుట్‌నోట్‌లో మూలభాషలో క్రీస్తు అని వ్రాసారు. క్రీస్తు అని వ్రాయబడిన ఆ మూలభాష ఏమిటో బైబిల్ సొసైటీ దొంగలు మనకు చెప్పవలసి ఉంది. మూలాభాష? అంటే ఏమిటో తెల్సుకొని నాకు చెప్పండి. అది ఎక్కడిదో? ఎవరిదో? దాని లిపి ఏమిటో? దానిని ఎవరు మాట్లాడుతున్నారో నాకు చాలా అవసరం. క్రైస్తవులు అని పిలవబడే ప్రతీ క్రైస్తవుడు ఈ మూలభాషను తెల్సుకోవలసిఉన్నది.

బైబిల్ మూలాభాషలో వ్రాయబడలేదు. హెబ్రీలో వ్రాయబడినది. మెస్సీయ శిష్యులందరూ హెబ్రీయులే గనుక మత్తయి నుండి ప్రకటన వరకూ కూడా హెబ్రీలోనే వ్రాయబడినది. అనేకమైన హెబ్రీపదములు మనకు కనిపిస్తున్నాయి. ఉదా: మెస్సీయ, హల్లెలూయ, ఆమెన్, రబ్బీ, రబ్బూనీ, గొల్గొతా, ఎప్పత్థా, తలితాకుమి, ఏలీ, ఏలీ, లామా సబక్తానీ మొదలైనవి. జరిగిన సంఘటనలు మరియు వ్రాయబడిన ప్రదేశములన్నీ ఇశ్రాయేలు దేశమునకు సంబంధించినవై యుండగా, హెబ్రీలోగాక గ్రీకులో ఎలా వ్రాయబడింది బైబిలు? క్రొత్త నిబంధనను వ్రాసిన వారంతా ఆయన శిష్యులు కారా? ఆలోచించండి.

1. మొట్టమొదటిగా బైబిల్ యూదులది (రోమా 3:1-3)
2. రక్షకుడైన మెస్సీయ యూదుడు (యోహాను 4:9)
3. రక్షణ యూదులనుండే అన్యులకు వచ్చింది (యోహాను 4:22)
4. క్రొత్తనిబంధన ఇశ్రాయేలీయులది+యూదులది (యిర్మియా 31:31, హెబ్రీ 8:8)
5. మెస్సీయ వచ్చింది కూడా యూదులకొరకే (మత్తయి 10:5-6)
6. వాగ్ధాన నిబంధనలు, నిరీక్షణ అన్నీయూదులవే (ఎఫెస్సీ 2:12, రోమా 9:4)
7. లోకమందు ఎలోహీం యూదులవాడే (ఎఫెస్సీ 2:12)
8. రొట్టె, పిల్లలైన యూదుల కొరకే (మత్తయి 15:26)
9. మెస్సీయ యూదుల రాజు (మత్తయి 2:2)
10. మెస్సీయ స్వకీయుల యొద్దకే వచ్చెను (యోహాను 1:11)
11. మెస్సీయ కొరకు ఎదురు చూచినవారు యూదులే (యోహాను 4:25)
12. మెస్సీయ వారి దేశంలోనే పుడతాడని వారికి తెలుసు (మత్తయి 2:4)
13. యూదులకు ఆయన "మెస్సీయ" గానే తెలుసు (యోహాను 1:41-42)
14. ఆయన శిష్యులందరూ యూదులే (మత్తయి 10:2-4)
15. ఇశ్రాయేలు వంశంలో నశించిన గొఱ్ఱెల యొద్దకే ఆయన వచ్చాడు (మత్తయి 10:6)
16. విందు సిద్ధపర్చింది యూదులకే (మత్తయి 22:1-10)
17. పస్కా భుజించినది వారితోనే (మత్తయి 26:17-29)
18. ఆయనను అప్పగించిన వాడు ఆయనవాడే (మత్తయి 26:14-16)
19. ఆయనను చంపింది కూడా ఆయనవారే (11:26,59)
20. జరిగిన చరిత్ర అంతా యూదులదే : జరిగిన ప్రదేమంతా ఇశ్రాయేలీయుల దేశములోనే మాట్లాడిన భాష హెబ్రీయే.

## గమనించండి

1. **యషువ మెస్సీయను యూదులరాజు (మత్తయి 2:2) అని అన్నారే గాని** క్రైస్తవమత లేక మార్గ స్థాపకుడని అనలేదు.
2. **మనుష్యకుమారుడు, ఎలోహీం కుమారుడు, యోసేపు కుమారుడు, అద్వితీయ కుమారుడు, ప్రియ కుమారుడు అను మాటలతోనే ఆయనను పిలిచారు గాని** క్రైస్తవుల దేవుడని, త్రిత్వంలో రెండవ వ్యక్తని, పిలవలేదు.
3. **నజరేయుడని (మత్తయి 2:23) అన్నారే** గాని యేసుప్రభువు అని అనలేదు.
4. **పిలాతు ఆయనను చూచి యూదుల రాజువు నీవేనా (మత్తయి 27:11) అని అడిగాడే** గాని క్రైస్తవమత స్థాపకుడవు నీవేనా? అని అడగలేదు.
5. ప్రజలు, **శిష్యులు ఆయనను రబ్బీ, రబ్బూనీ అని పిలిచారే గాని** క్రైస్తవ బోధకుడా! అని పిలవలేదు.
6. **ధర్మశాస్త్రంలో మోషేయు ప్రవక్తలు ఎవరిని గూర్చి వ్రాసిరో ఆయనను కనుగొంటిమి (యోహాను 1:45) అని అన్నారే** గాని మాల-మాదిగల దేవుడని, లేక అమెరికా దొరల దేవుడని అనలేదు.
7. **లోక పాపమును తీసివేయు ఎలోహీం గొఱ్ఱె పిల్లని యోహాను అన్నాడేగాని** క్రైస్తవుల పాపం తీసివేసేవాడని అనలేదు.

మతశాఖలు అపోస్తలుల కాలంలో యూదుల మధ్య కొన్ని ఉన్నప్పటికీ, A.D 200 నుండి మాత్రం పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. మతశాఖలకు తల్లిసంఘం రోమన్ కాథలిక్. దానినుండే లూథరన్, బాప్టిస్ట్, పెంతెకోస్తు, ఫెలోషిప్ మొ॥గు నానావిధశాఖలు విడిపోయి క్రైస్తవ ప్రపంచాన్నే రాజ్యం ఏలుతున్నాయి. కాని నిజమైన సమాజము ఆది అపోస్తలుల కాలంలోనే (A.D 27-A.D 100) ఉంది. దాని సిద్ధాంతములనే నేడు మేము బోధిస్తున్నాము. అందుకే మా పత్రిక మతశాఖలవారికి కాదు అంటున్నాము. అయితే మతశాఖలలో ఉండి సత్యాన్ని అన్వేషించే విశ్వాసులు ఉన్నారు. వారికి మాత్రమే ఈ పత్రిక ఉపయోగపడుతుంది. గనుక మీరు ఎవరైనా సత్యమును తెలుసుకోగోరినట్లయితేనే ఈ పత్రిక చదవండి. లేని పక్షమున మీ మతశాఖలలోనే ఉండి వాటి ప్రకారంగానే నడుచుకోండి. బలవంతంగా చెప్పి, ఒప్పించాల్సిన అవసరత మాకు లేదు. మేము 100% వాక్యానికి ప్రాముఖ్యతనిస్తాము గాని ఆచారములకు మతశాఖ నియమనిబంధనలకు కాదు. గనుక దయతో అర్థంచేసుకొని సహకరించవలసినదిగా సార్వత్రిక క్రైస్తవ సంఘమును, క్రైస్తవ బోధకులను, డినామినేషన్ విశ్వాసులను కోరుచున్నాము.

- బైబిలు విషయంలో మీకు ఎలాంటి సందేహములు ప్రశ్నలు ఉన్ననూ, నిర్మొహమాటంగా మమ్మును అడుగవచ్చును. సంప్రదించవచ్చును. 9246653613 కి ఫోన్ చేస్తే మేమే మాట్లాడతాము. హైదరాబాద్ అయితే, 9292802443, 9292802447లకు ఫోన్ చేసి మాట్లాడవచ్చు.

మేము ఎవరిపై ద్వేషముతో గాని, అసూయతో గాని ఈ విషయములను బోధించుటలేదు. పరమతండ్రి మాకు అనుగ్రహించిన కృపనుబట్టి, దైవభయము కలిగి మాత్రమే బోధిస్తున్నాము. మీరు సత్యమును తెల్సుకొనవలెనని ఆశ కలిగినట్లయితే మమ్మును సంప్రదించండి. సదుద్దేశముతో మీరు అడిగే ఎలాంటి ప్రశ్నలకైననూ మేము వాక్యము ద్వారా సమాధానము చెప్పగలము.
డినామినేషన్స్ అన్నిటినీ మేము పరిశీలించాము. వారి బోధలన్నీ మాకు తెలుసు. వారు చెప్పేది ఎంత వరకు వాక్యప్రకారమో, ఎంత వాక్యము కాదో పరిశీలనగా తెల్సుకున్నాము గనుక మేము మతశాఖల బోధలకు వ్యతిరేకులము. మతశాఖలు పరలోకరాజ్యమునకు నడిపించవు. వాక్యము మాత్రమే పరలోకమునకు చేర్చును. మీరు నిజంగా పరలోకరాజ్యము చేరాలనుకుంటే మతశాఖలను వీడి, సత్యమును వెంబడించి, వాక్యమును గౌరవించవలసి ఉంది. అట్టి ఆత్మ పరమతండ్రి మీ అందరికీ దయచేయును గాక! ఆమెన్!!

# యుద్ధము యావె దే

*-బ్రదర్ పి. రాజు*

సైన్యములకు అధిపతియగు యావె తన ప్రజలైన ఇశ్రాయేలీయుల పక్షమున వారి శత్రువులతో అనేక మారులు యుద్ధం చేసి తన ప్రజలను కాపాడినట్లు పరిశుద్ధ గ్రంథములో లేఖనములు చదువుట ద్వారా మనం గ్రహించవచ్చు. ఎలోహీం అయిన యావె మన పితరుడైన అబ్రాహామునకు వాగ్దానము చేసిన రీతిగా అతని యొక్క సంతానం ఈ భూమిమీద నుండి కొట్టివేయబడకుండునట్లు నాటి నుండి నేటి వరకు వారి పక్షమున యుద్ధములు జరిగించుచూ వారిని కాపాడుచున్న సంఘటనలను మనము చదివినకొద్దీ మనకు ఎంతో ఆశ్చర్యము కల్గును. అయితే ఇశ్రాయేలీయులు ఎలోహీం చేసిన మేళ్ళను మరిచి ఆయనను వదలి ఇతర దేవతలను పూజించి, వారి మేలు కొరకై నియమించిన ఆజ్ఞలను కట్టడలను త్రోసివేసినప్పుడు ఆయన తన ప్రజలపై కోపగించి వారి మీదికి శత్రువులను రేపి వారి శత్రువుల పక్షమున ఇశ్రాయేలీయులకు విరోధంగా యుద్ధంచేసి వారిని శిక్షించిన సంఘటనలు కూడా ఎన్నో మనము పరిశుద్ధ గ్రంథములో కనుగొనగలము. ముందుగా మనం తన స్వకీయ సంపాద్యమగు ఇశ్రాయేలును వారి శత్రువుల బారినుండి ఆశ్చర్యముగా రక్షించిన సంఘటనలను కొన్నింటిని చూద్దాం.

1) మన పితరుడైన అబ్రహాము దినములలో ఏలాం రాజైన కదొర్లాయోమెరును గోయీయుల రాజైన తిదాలు, షీనారు రాజైన అమ్రాపేలు, ఎల్లాసరు రాజైన అర్యోకు అను నల్గురు రాజులు సొదొమ, గొమొఱ్ఱాలను దోచుకొని అబ్రహాము బంధువైన లోతును, అతని భార్యను, పిల్లలను, ఆస్తిని పట్టుకొనిపోగా అబ్రహాము కేవలము మూడువందల పదునెనిమిది మంది ఎటువంటి యుద్ధనైపుణ్యము లేని దాసులను వెంటబెట్టుకొని పోయి ఆ రాజులను ఓడించి వారు దోచుకొన్నది యావత్తు మరల విడిపించాడు. అయిదురుగు రాజులు, వారి సైన్యము చేయలేని పనిని అబ్రహాము కేవలము మూడువందల పదునెనిమిది మంది దాసులతో సాధించెను. పరమతండ్రి అబ్రాహామునకు తోడుగా ఉండెను గనుక ఈ కార్యము జరిగెను.

2) తన ప్రజలైన ఇశ్రాయేలీయులు ఐగుప్తు దాసత్వములో ఉన్నప్పుడు ఎలోహీం అయిన యావె మోషే అహరోనుల ద్వారా ఐగుప్తీయులతో యుద్ధము చేసాడు. వారిని తెగుళ్ళతో వడగండ్లతో బాధించాడు. వారి తొలి సంతానాన్ని చంపాడు. చివరిగా ఐగుప్తీయులను ప్రేరేపించి వారిని ఎఱ్ఱ సముద్రమునకు తీసికొని వచ్చి ఆ సముద్రములో వారిని ముంచివేసాడు. వెనుక శత్రువులు, ముందు సముద్రము, దిక్కు తోచక మోషే మీద తిరుగుబడిన ఇశ్రాయేలీయులతో మోషే ఈలాగు సెలవిచ్చెను. ***భయపడకుడి, యావె మీకు నేడు కలుగజేయు రక్షణను మీరు ఊరక నిలిచుండి చూడుడి; మీరు నేడు చూచిన ఐగుప్తీయులను ఇక మీదట మరి యెన్నడును చూడరు. యావె మీ పక్షమున యుద్ధము చేయును. మీరు ఊరకయే ఉండవలెనని ప్రజలతో చెప్పెను.***(నిర్గమ 14:13,14). నిరాయుధులైన ఇశ్రాయేలీయులను సంహరించడానికి బయలుదేరిన ఫరో సైన్యానికి ఎఱ్ఱసముద్రము మధ్యలో రథచక్రాలు ఊడేవరకు అసలు సంగతి తెలియలేదు. **అప్పుడు ఐగుప్తీయులు** - ***ఇశ్రాయేలీయుల ఎదుట నుండి పారిపోదము రండి; యావె వారి పక్షమున మనతో యుద్ధము చేయుచున్నాడని చెప్పుకొనిరి*** (నిర్గమ 14:25)

3) మోషే సేవకుడైన యెహోషువ కాలంలో హెబ్రోను, యర్మూతు, లాకీషు, ఎగ్లోను, రాజులతో గిబియోనులో యెహోషువ యుద్ధము చేసినప్పుడు వారిశత్రువులపై ఎలోహీం గొప్ప వడగండ్లు పడవేసాడు. ఆ వడగండ్ల చేత చాలామంది చనిపోయారు. యెహోషువ చేసిన ప్రార్థన విని వారి శత్రువులందరు నశించే వరకు ఒకరోజెల్లా సూర్యుడు అస్తమించకుండా యావె చేసాడు - ***యావె ఒక నరుని మనవి వినిన ఆ దినము వంటి దినము దానికి ముందేగాని దానికి తరువాతే గాని ఉండలేదు. నాడు యావె ఇశ్రాయేలీయుల పక్షముగా యుద్ధము చేసెను.*** (యెహోషువ 10:14)

4) ఇశ్రాయేలీయులు యావె దృష్టికి దోషులైనందున వారిని మిద్యానీయుల చేతికి అప్పగించెను. మిద్యానీయులు ఇశ్రాయేలీయులను ఏలుచున్న కాలంలో ఎలోహీం అయిన యావె ఇశ్రాయేలీయులను మిద్యాను వారి చేతిలోనుండి విడిపించడానికి యోవాషు కుమారుడైన గిద్యోనును ఎన్నుకున్నాడు. ఆ కాలములో మిద్యానీయులు, మోయాబీయులు తూర్పువారితో కలిసి ఇసుక రేణువులంత విస్తారసైన్యముతో ఇశ్రాయేలీయుల మీద యుద్ధము చేయడానికి వచ్చారు. అప్పుడు గిద్యోను కేవలము మూడువందల మందితో ఆ విస్తారమైన సైన్యముతో యుద్ధముచేసి వారి రాజులను చంపి వారి సైన్యములను తరిమి కొట్టాడు. ***ఆ మూడువందలమంది బూరలను ఊదినప్పుడు యావె దండంతటిలోను ప్రతివాని ఖడ్గమును వాని పొరుగు వానిమీదికి త్రిప్పెను.*** (న్యాయాధి 7:22).

5) యూదా రాజైన ఆసా యేలుబడిలో కూషీయుడైన జెరహు యూదావారి మీదికి పదిలక్షలమంది సైనికులతో, మూడువందల రథములను సమకూర్చుకొని దండెత్తిరాగా ఆసా ఎలోహీం అయిన యావెకు మొఱ్ఱపెట్టగా యావె శత్రుసైన్యాన్ని మొత్తినందున వారు పారిపోయారు. ***ఆసాయును అతనితో కూడ ఉన్నవారును గెరారు వరకు వారిని తరుమగా కూషీయులు మరల పంక్తులు తీర్చలేక యావె భయము చేతను ఆయన సైన్యపు భయముచేతను పారిపోయిరి.*** (2దిన 14:13, 15వ అధ్యాయము)

6) యూదారాజైన యెహోషాపాతు దినములలో మోయాబీయులను అమ్మోనీయులను మెయోనీయులలో కొందరును యెహోషాపాతు మీదకు దండెత్తి రాగా అప్పుడు యెహోషాపాతును యూదావారందరును తమ శిశువులతోను, భార్యలతోను, పిల్లలతోను యావె సన్నిధిని నిలువబడి యావెకు మొఱ్ఱపెట్టగా లేవీయుడునగు యహజీయేలు మీదకు యావె ఆత్మ రాగా అతడు ఈలాగు ప్రకటించెను. ***యూదావారలారా, యరూషలేము కాపురస్తులారా...........భయపడకుడి,జడియకుడి. రేపు వారిమీదికి పోవుడి, యావె మీతో కూడ ఉండును.*** యహజీయేలు ప్రకటించిన విధంగా ఒక్కడును తప్పించుకొనకుండా శత్రువులందరు శవములుగా మారిపోయారు. యూదావారు వారి శత్రువుల కొల్ల సొమ్మును సమకూర్చుకోవడానికి మూడు రోజులు పట్టింది. ***ఇశ్రాయేలీయుల శత్రువులతో యావె యుద్ధము చేసెనని దేశముల రాజ్యములు వారందరు వినగా ఎలోహీం భయము వారందరిమీదికి వచ్చెను.*** (2దిన 20:29)

7) యూదారాజ్యాన్ని హిజ్కియా పరిపాలించు దినములలో అష్షూరు రాజైన సన్హెరీబు విస్తారమైన సైన్యముతో యూదారాజ్యము మీదికి దండెత్తివచ్చాడు. సన్హెరీబు అతని సేవకులు ఇశ్రాయేలీయులమీదను వారి ఎలోహీం అయిన యావె మీదను పేలాపనలు పేలారు. అప్పుడు రాజైన హిజ్కియా తన ప్రజలతో ఈలాగు చెప్పాడు. ***మీరు దిగులు పడకుడి, ధైర్యము విడువకుడి.......మాంససంబంధమైన బాహువే అతనికి అండ; మనకు సహాయము చేయుటకును మన యుద్ధములను జరిగించుటకును మన ఎలోహీం అయిన యావె మనకు తోడుగా ఉన్నాడని చెప్పాడు.*** (2దిన 32:7,8) అష్షూరు సైనికులతో పోరాడడానికి యావె ఒక దూతను పంపగా ఆ దూత శత్రుసైనికులను నాశనము చేయగా అష్షూరు రాజు సిగ్గునొందినవాడై పారిపోయాడు. ఈ విధంగా సైన్యములకు అధిపతియగు యావె తన ప్రజల పక్షముగా పలు యుద్ధాలు జరిగించాడు. అయితే తన స్వాస్థ్యమైన ఇశ్రాయేలు తనను విడిచిపెట్టి ఇతర దేవతలను పూజించినప్పుడు తాను నియమించిన ధర్మశాస్త్రమును త్రోసివేసినప్పుడు యావె తన ప్రజలకు విరోధియై వారి శత్రువుల పక్షము వహించి ఇశ్రాయేలును వారి శత్రువుల చేతికి అప్పగించిన సందర్భాలు కూడా పరిశుద్ధగ్రంథములో మనము కనుగొనగలము. వాటిలో కొన్నింటిని చూద్దాం.

1) ఎలోహీం అయిన యావె అద్భుత కార్యములను మహత్కార్యములను జరిగించి ఐగుప్తు దాస్యత్వము నుండి తన ప్రజలను రక్షించిన తర్వాత ఇశ్రాయేలీయులలో ఎలోహీం చేసిన ఆశ్చర్యకార్యములను చూసిన తరము చనిపోయిన తర్వాత ఆయన చేసిన కార్యాలను ఎరుగని తరమొకటి పుట్టగా వారు యావెను విసర్జించి, తమచుట్టునుండి జనుల దేవతలను అనుసరించి వాటిని పూజించిరి. కాబట్టి యావె కోపాగ్ని ఇశ్రాయేలీయులమీద మండెను. ఆయన దోచుకొనువారిచేతికి వారిని అప్పగించెను. వారు ఇశ్రాయేలీయులను దోచుకొనిరి; ఆయన వారి చుట్టునున్న వారి శత్రువులచేతికి వారిని అప్పగించెను. గనుక వారు తమ శత్రువులయెదుట నిలువలేకపోయిరి. (న్యాయాధి 2:10-14)

2) ఇశ్రాయేలీయులు యావె దృష్టికి దోషులు కాగా యావె ఏడేండ్లు వారిని మిద్యానీయుల కప్పగించెను (న్యాయాధి 6:1)

3) ఇశ్రాయేలీయులు మరల యావె దృష్టికి దోషులు కాగా నలువది సంవత్సరములు వారిని ఫిలిష్తీయుల చేతికి అప్పగించెను (న్యాయాధి 13:1)

4) ఇశ్రాయేలు రాజైన యెహోయహాజు యరోబాము పాపములను విడువక అనుసరించుచు యావె దృష్టికి చెడుతనము జరిగించినందున యావె కోపం ఇశ్రాయేలువారిమీద రగులుకొనగా ఆయన సిరియారాజైన హజాయేలు దినములన్నిటను అతని కుమారుడైన బెన్హదదు దినములన్నిటను ఇశ్రాయేలువారిని వారికప్పగించెను.

5) ఇశ్రాయేలును ఏలా కుమారుడైన హోషేయ షోమ్రోనులో ఏలనారంభించి తొమ్మిది సంవత్సరములు ఏలెను. ఇతడు కూడా యావె దృష్టికి చెడుతనమే జరిగించెను. ఇశ్రాయేలీయులు యావెను విడిచిపెట్టి ఏ విధముగా విగ్రహారాధన చేశారో అదంతయు 2రాజులు 17వ అధ్యాయములో వివరించబడింది. తత్ఫలితంగా అష్షూరు రాజు షోమ్రోను మీదకు దండెత్తి షోమ్రోనును పట్టుకొని ఇశ్రాయేలువారిని చెరగొనిపోయి వివిధ ప్రదేశములలో వారిని ఉంచెను. షోమ్రోను దేశములోనికి విగ్రహారాధికులైన బబులోను,కూతా,అవ్వా, హమాతు సెపర్వయీము అను దేశములలోనుండి జనులను రప్పించి వారు షోమ్రోనులో కాపురముండునట్లు చేశాడు.

6) ఇశ్రాయేలీయుల రాజైన సిద్కియా దినములలో అతడు యావె దృష్టికి చెడునడత నడచుచు ప్రవక్తయైన యిర్మీయా మాట వినకుండెను. ప్రజలు, యాజకులు అందరునూ హేయమైన విగ్రహాలను పెట్టుకొని పూజించుచు యావె మందిరాన్ని అపవిత్ర పరిచారు. కృపామయుడైన యావె పెందలకడ లేచి ప్రవక్తలను పంపుచూ వచ్చిననూ వారు యావె మాటలను లక్ష్యపెట్టకుండా యావె పంపుచున్న దూతలను హింసించిరి. అప్పుడు యావె కోపం జనుల మీదకు రాగా యావె బబులోను రాజైన నెబుకద్నెజరు చేతికి ఇశ్రాయేలీయులను అప్పగించాడు. ఈ కల్దీయ చక్రవర్తి పిన్నలనేమి, పెద్దలనేమి ఖడ్గం చేత సంహరించాడు. పరిశుద్ధ మందిరాన్ని దోచుకొని మందిరాన్ని తగులబెట్టాడు. యరూషలేము ప్రాకారాలను పడగొట్టి నగరాన్ని కాల్చివేశాడు. చావకుండా మిగిలినవారిని బబులోనుకు చెరగొనిపోయాడు. అప్పుడు ప్రవక్తయైన దానియేలు బాలుడు. 70 సంవత్సరాలుగా అక్కడే ఉండి ఇశ్రాయేలీయులు నెబుకద్నెజరుకు దాస్యత్వం చేశారు. అతని తరువాత నెబుకద్నెజరు కుమారుడైన బెల్షసరు, మాదీయులు, పారసీకులు ఇశ్రాయేలీయులను ఏలారు. మన రక్షకుడైన యషువ మెస్సీయ పుట్టే సమయానికి ఇశ్రాయేలను రోమీయులు పాలిస్తున్నారు. ఆ తర్వాత యరూషలేము మీద చాలామంది దండెత్తి నగరాన్ని నాశనం చేశారు. ఇశ్రాయేలీయులు ప్రపంచమంతటా చెదరిపోయారు. ఆయా దేశాలలో ఎన్నో బాధలు పడ్డారు. హిట్లర్ లాంటి నియంతల క్రూరత్వానికి బలయ్యారు. అప్పుడు యావె తన ప్రజల కడగండ్లు చూసి తాను వారి పితరులతో చేసిన ప్రమాణమును గుర్తుకు తెచ్చుకొని యెషయ, యిర్మీయా, యెహెజ్కేలు మొదలగు ప్రవక్తలు ప్రవచించిన విధంగా తన స్వాస్థ్యమైన ఇశ్రాయేలును వారికి తాను నిత్యస్వాస్థ్యముగా ఇచ్చిన కనాను దేశములోనికి వారిని ప్రవేశపెట్టాడు. ఇలా వారు ఒక దేశంగా ఏర్పడ్డారో లేదో అప్పుడే వారు తమ శత్రువులతో యుద్ధం చేయవలసి వచ్చింది. వారి చేతిలో ఆయుధాలు లేకపోయినా పరమతండ్రి కృపవల్ల వారి శత్రువుల బారినుండి ఇశ్రాయేలీయులు తప్పించుకున్నారు. పరమతండ్రి వారిని ఆశీర్వదించడం వల్ల వారు దినదినాభివృద్ధి పొందారు. ఇండ్లు కట్టుకున్నారు వ్యవసాయం, గొఱ్ఱెల పెంపకం, పరిశ్రమల స్థాపన ఇలా అన్నింటిలో తమ శత్రువులు అసూయపడేలా అభివృద్ధి సాధించారు. బంజరు భూములను సాగుచేసి పుష్కలంగా పంటలు పండిస్తున్నారు. ఒక ప్రక్క శత్రువులతో నిరంతర పోరాటం చేస్తూ మరో ప్రక్క నిరంతర అభివృద్ధి సాధిస్తున్నారు. విశ్రాంతి, నెలపొడుపు, పస్కా, వారముల పండుగ, పర్ణశాలల పండుగ ఒకటేమిటి మోషే ద్వారా ఎలోహీం వారికిచ్చిన నియామక కాలాలన్నిటిలోను వారు ఎలోహీం అయిన యావెను భయభక్తులతో ఆరాధించుచున్నారు. కాబట్టి ఇశ్రాయేలు పక్షమున యావె మరల యుద్ధం చేయుచున్నాడు. ఇశ్రాయేలను పేరు ఈ భూమిమీద ఎవరు పలుకకుండా చేయాలని గత 60 సంవత్సరాలనుండి ఎంతోమంది ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నా వారి ఆటలు సాగకుండా యావె చూస్తున్నాడు. పక్షి తన పిల్లలను తన రెక్కల క్రింద ఏలాగు చేర్చుకొనునో ఆలాగు తన బాహువు క్రింద ఇశ్రాయేలీయులను ఉంచి వారిని ఆయన కాపాడుచున్నాడు. ఇశ్రాయేలును ముట్టుకుంటే (కీడుచేస్తే) వాడు తన కనుగుడ్డు ముట్టినవానితో సమానం అని యావె సెలవిచ్చుచున్నాడు (జెకర్యా 2:8) యావె వారికి తోడుగా ఉన్నంతకాలము వారిని ఎవరూ ఏమి చేయలేరు. ఆనాడైనా, ఈనాడైనా, ఏనాడైనా ఇశ్రాయేలునకు రథములును రౌతులును యావెయే. (2రాజులు 2:12) బెయోరు కుమారుడైన బిలాము ఇశ్రాయేలీయులను గురించి ఏమని ప్రవచిస్తున్నాడో చూడండి. ***ఇదిగో ఆ జనము ఆడు సింహము వలెలేచును. అది సింహం వలె నిక్కి నిలుచును అది వేటను తిని చంపబడిన వాటి రక్తము త్రాగువరకు పండుకొనదు.*** తమమీద పదేపదే దాడులు చేస్తున్న శత్రువుల గడ్డాలు పట్టుకొని బ్రతిమాలడానికి అది ఇండియా కాదు ఇశ్రాయేల్!! ***ఇశ్రాయేలును కాపాడువాడు కునుకడు, నిద్రపోడు. యావెయే నిన్ను కాపాడువాడు.*** (కీర్తనలు 121:3,4) ***యరూషలేముయొక్క క్షేమము కొరకు ప్రార్థన చేయుడి. యరూషలేమా నిన్ను ప్రేమించువారు వర్ధిల్లుదురు.*** (కీర్తనలు 122:6,7) ***మనుష్యులు మనమీదికి లేచునప్పుడు యావె మనకు తోడైయుండని యెడల వారి ఆగ్రహము మనపైని రగులుకొనినప్పుడు యావె మనకు తోడైయుండని యెడల వారు మనలను ప్రాణములతో మ్రింగివేయుదురు.*** (కీర్తనలు 124:1-8)

**ఇశ్రాయేలూ, నీ భాగ్యమెంత గొప్పది! యావె రక్షించిన నిన్ను పోలియున్నవాడెవడు?**

**సైన్యములకధిపతియగు యావెకు యుగయుగములు స్తుతి, ఘనత, మహిమ ప్రభావములు కలుగును గాక!!**

Printed, Published and Owned by Isaac. E. Kusuma and Printed at Ratna Offset, Malikipuram -533 253. E.G. Dt. and Publsihed at Malikipuram Editor Isaac E. Kusuma. All rights reserved